క్లుప్తంగా

ఘనంగా సీతారాముల పెళ్లిరాట మహోత్సవం



సీతారాముల పెళ్లిరాట ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

మునగపాక: స్థానిక గౌరీ పరమేశ్వరుల ఆలయ ప్రాంగణంలోని రామాలయం వద్ద శనివారం సీతారాముల పెళ్లిరాట మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన

కోటవురట్ల: ఇంటర్ ఫలితాలలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల అధ్యాపకులు అభినందించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 42 శాతం, ద్వితీయ సంవత్సరం 62లో శాతం ఉత్తీర్ణత సాధించిట్టు ప్రిన్సిపాల్ ఎ.ఆర్.టి.సుజాత తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఒ.శైలు 443(ఎంపీసీ), ఎస్.లోకేశ్వరి 413(బైపీసీ), ఎల్.దుర్గాప్రసాద్ 419(సీఈసీ) మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచినట్టు తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో ఐ.నిఖిత 920(బైపీసీ) మార్కులు, ఎస్.కె.ముషారపుల్ ఇస్లాం 900(ఎంపీసీ), పి.రేవతి 842(సీఈసీ) మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారు. ఒకేషనల్ మొదటి సంవత్సరం ఎ.కుమారి (ఎంపీహెచ్‌డబ్ల్యు) 471, ద్వితీయ సంవత్సరం సి.హెచ్.పల్లవి (ఎంపీహెచ్‌డబ్ల్యు) 933 మార్కులు సాధించినట్టు తెలిపారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది

అచ్యుతాపురం: స్థానిక ప్రధాన రహదారుల్లోని ఆక్రమణలు, దీర్ఘకాలంగా నిలిపి ఉంచిన వాహనాలను శనివారం తొలగించారు. ఇటీవల యలమంచిలి మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదానికి రోడ్డు పక్కన ఆక్రమణలు, పార్కింగ్‌లే కారణంగా గుర్తించిన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఐ బుచ్చిరాజు ఆధ్వర్యంలో ఆక్రమణలు తొలగించారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

మునగపాక: మండలంలోని చూచుకొండ సమీపంలో పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. చూచుకొండ సమీపంలో పేకాడుతున్నట్టు అందిన ఫిర్యాదు మేరకు శుక్రవారం రాత్రి ఎస్ఐ ప్రసాదరావు తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ. 87,660 నగదు స్వాధీనం చేసుకున్నారు.ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు.

ఉపాధి హామీ పథకం పనుల పరిశీలన

మునగపాక: ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎం.మన్మధరావు తెలిపారు. మండలంలోని తిమ్మరాజుపేట,అరబుపాలెంలలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా కాలువలు, చెరువులను అభివృద్ధి చేసుకునే వీలుందన్నారు. పనిచేసే ప్రాంతాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు.

నేడు అంబేడ్కర్ జయంతి వేడుకలు

మునగపాక: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని ఆదివారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. దీనిలో భాగంగా స్థానిక బీసీ కాలనీలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు బీచ్‌బాయ్స్, అంబేడ్కర్ కాలనీ వాసులు తెలిపారు. మహిళలకు ముగ్గుల పోటీలు, డ్యాన్స్ హంగామా వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కోలాటం, తప్పెటగుళ్లు, కోబ్రా డ్యాన్స్ తదితర ప్రదర్శనలు నిర్వహించనున్నారు.

అభివృద్ధి చేశాం... అందుకే ఓట్లడుగుతున్నాం

- ఎమ్మెల్యే అభ్యర్థి జోగులు, రాజ్యసభ సభ్యుడు బాబూరావు
- గొడిచర్లలో హోరెత్తిన ప్రచారం



వైఎస్సార్‌సీపీ నాయకులకు హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు



తనకు ఓటు వేయాలని మహిళలను అభ్యర్థిస్తున్న కంబాల జోగులు, నాయకులు



గొడిచర్లలో ప్రచారంలో పాల్గొన్న అభ్యర్థి కంబాల జోగులు, రాజ్యసభ సభ్యుడు బాబూరావు

నక్కపల్లి: గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాం, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేశాం... ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు మా పార్టీకే ఉంది.. అందుకే మళ్లీ అవకాశం ఇవ్వాలంటూ మీ ముందుకు వచ్చామని పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు అన్నారు. శనివారం మండలంలో గొడిచర్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. తీన్మార్ డప్పులతో ప్రచారం కోలాహలంగా సాగింది. ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు మాదిరిగా ఎన్నికల్లో గెలవడం కోసం అప్పటికప్పుడు పథకాలు ప్రకటించలేదన్నారు. పాదయాత్రలో గుర్తించిన సమస్యలను పరిష్కరించడం కోసం జగనన్న నవరత్నాలను అమలు చేశారని చెప్పారు. 50కి పైగా పథకాలను అమలు చేసి ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చినట్టు తెలిపారు. జగనన్నను మళ్లీ సీఎంను చేస్తే ఈ పథకాలన్నీ కొనసాగుతాయని చెప్పారు. ప్రతి గ్రామంలోను 150 మందికి తక్కువ లేకుండా ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, ఇళ్లనిర్మాణానికి ఆర్థికసాయం అందించినట్టు తెలిపారు. అవ్వాతాతలకు ఇంటి వద్దకే పెన్షన్లు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందని చెప్పారు. పథకాలు అమలు చేయకుండా చంద్రబాబు కోర్టు ద్వారా అడ్డుకున్నారన్నారు. చంద్రబాబు పొరపాటున అధికారంలోకి వస్తే ఈ పథకాలన్నీ రద్దుచేస్తారని, మళ్లీ జన్మభూమి కమిటీలే రాజ్యమేలుతాయని చెప్పారు. ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. రెండేళ్లనుంచి ప్రజల్లోనే ఉంటూ మీ సమస్యలు తెలుసుకుంటూ మీతో మమేకమవుతున్నామన్నారు. తమలా తెలుగుదేశం పార్టీ నాయకులు ఎప్పుడైనా వచ్చారా అని ప్రశ్నించారు. ఎన్నికలు వస్తున్నాయి కాబట్టే నెలరోజులనుంచి రోజూ గ్రామాల్లో తిరుగుతున్నారని చెప్పారు. ఇటువంటి వారిని నిలదీయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, సర్పంచ్ అల్లుపార్వతి రమణ, ఎంపీటీసీ నిట్ల దేవిగోవింద, పీఏసీఎస్ అధ్యక్షుడు పొడగట్ల పాపారావు, యలమంచిలి తాతబాబు, సర్పంచ్‌లు సాదిరెడ్డి శ్రీను, పొడగట్ల వెంకటేష్, వియ్యపు శ్రీను, గొర్ల నర్సింహమూర్తి, ఎంపీటీసీలు గొర్ల గోవిందు, బచ్చలరాజు,జేసీఎస్ కన్వీనర్లు సూరాకాసుల గోవిందు, నల్లల రామకృష్ణ, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి, సీనియర్ నాయకులు వెలగా వెంకటశివ, ఇందన రాము, వెలగా వీరభద్రరావు, వేగేశ్నచంటి, దండుబలరామరాజు, సఖిరెడ్డిరమణ, వెలగా రమణ,దమ్ము అప్పలకొండ,మంతిన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం

మునగపాక: కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి భక్తులు తమ విరాళాలు అందజేస్తున్నారు. స్థానిక బైపాస్ రోడ్డు వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఆలయ నిర్మాణంలో పలువురు భక్తులు భాగస్వాములవుతున్నారు. శనివారం రాత్రి మునగపాకకు చెందిన కర్రి సూరి అప్పారావు కుమారుడు అనంతరావు రూ.25వేలు, ఆడారి సత్యారావు కుమారుడు శివాజీ రూ.10,116 నగదును ఆలయ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, కమిటీ సభ్యులు మళ్ల జోగారావు,ఆడారి లక్ష్మణరావు, టెక్కలి కొండలరావు,వెలగా శ్రీనివాసరావు,విల్లూరి మోహన్, జల్లేపల్లి వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.



వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాతలు

పల్లెల్లో ఫ్యాన్ ప్రచార హోరు

ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దూసుకుపోతున్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రచారానికి స్థానికుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. తమ ఓటు వైఎస్సార్‌సీపీకేనని అవ్వాతాతలు, సంక్షేమ పథకాలు లబ్ధిదారులు ముక్తకంఠంతో చెబుతున్నారు.



సత్యవరంలో ప్రచారం నిర్వహిస్తున్న చిక్కాల రామారావు, నాయకులు



గుడివాడలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని దివ్యాంగుడిని కోరుతున్న మహిళా నాయకురాలు శారదాకుమారి



వమ్మవరంలో ప్రచారం చేస్తున్న మహిళా నాయకురాలు శారదాకుమారి



మూలజంపలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ ప్రచార పత్రాలను ప్రదర్శిస్తున్న నాయకులు



సింగవరంలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ గోవింద్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర

పాయకరావుపేట: మండలంలోని సత్యవరం, మంగవరం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షులు చిక్కాల రామారావు ఆధ్వర్యంలో సత్యవరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు యథాతథంగా కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు.ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులును, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడును గెలిపించాలని కోరారు. సత్యవరంలో నిర్వహించిన ప్రచారంలో పార్టీ మండల అధ్యక్షులు చిక్కాల రామారావు, మాజీ ఎమ్మెల్సీ శివకుమారి, సర్పంచ్‌లు సకిలేటి రాము, గెడ్డమూరి శ్రీనివాసరావు, ఎంపీటీసీ యాగదాసు శేఖర్, నాయకులు గూటూరు వెంకటేశ్వరరావు, దేవవరపు వెంకటేశ్వరరావు, యజ్జల సత్యనారాయణ, పల్లేల వెంకట్, పక్కుర్తి లోవ, నీలాపు చిరంజీవి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మంగవరంలో నిర్వహించిన ప్రచారంలో సర్పంచ్ వంగలపూడి రామారావు, పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, కోనే పుత్రరావు, పెనుమత్స నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీ విజయానికి సహకరించాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు దగ్గుపల్లి సాయిబాబా, పార్టీ మాజీ మండల అధ్యక్షులు ధనిశెట్టి బాబూరావు కోరారు. పట్టణంలోని దేవాంగుల వీధి, అల్లాడవారి వీధిలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు ప్రతి ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడును అధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం బ్రోచర్లను ఓటర్లకు పంపిణీ చేస్తున్నారు. గ్రామ ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పంచాయితీ వార్డు సభ్యుడు ధనిశెట్టి మహేష్, పిరాధి రాజు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు కాధా రామకృష్ణ, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు డి.నానాజీ, నాయకులు నెలపర్తి నాగరాజు, కొశిరెడ్డి నాగేశ్వరరావు, బూడిద గౌరీశంకర్, రెడ్డి, కేశనకుర్తి సత్తిబాబు తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: మండలంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జోరుగా ప్రచారం చేశారు. వమ్మవరం, గుడివాడల్లో ప్రచారం నిర్వహించారు. వమ్మవరంలో మాజీ ఎంపీపీ బొలిశెట్టి శారదాకుమారి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కాకర దేవి, గవరకార్పొరేషన్ డైరెక్టర్ కొణతాల ఉమాదేవి, సర్పంచ్ పాలపర్తి పాపారావు, ఎంపీటీసీ బాలం సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు గొంతిన సత్యనారాయణ,కొక్కిర్లపాటి కాశీవిశ్వనాథం,మాజీ సర్పంచ్ చిందాడ మంగ,షేక్ జైనాబీ బీ, రాయి రామరాజు, కర్రి మహేష్, తలారి రాము తదితరులు పాల్గొన్నారు. పాయకరావుపేట వైఎస్సార్ సీపీ అభ్యర్థి కంబాల జోగులుకు మద్దతుగా గుడివాడ శివారు కొత్తపోలవరం గ్రామంలో స్థానిక నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీపతిరాజు, సర్పంచ్ ధూళి శ్రీనుబాబు, నాల్లపరాజు వెంకటరాజు తదితరులు ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించి, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అచ్చు రామరాజు, జోగిరాజు, వర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి: రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపించాలని యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, యలమంచిలి మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర కోరారు. యలమంచిలి మున్సిపాలిటీ యర్రవరం శివారు సింగవరంలో శనివారం రాత్రి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యు.వి. రమణమూర్తిరాజును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు ఇరువురూ మాట్లాడుతూ యలమంచిలి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు అభివృద్ధి చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్త, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, స్థానిక కౌన్సిలర్ పిట్టా సత్తిబాబు,కో ఆప్షన్ సభ్యుడు దూది నర్సింహమూర్తి,వైఎస్సార్‌సీపీ నేతలు దూళి అప్పలచిట్టి,నర్సింహం తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు జోరుగా ప్రచారం చేస్తున్నారు. మూలజంప గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వేగి అచ్చియ్యనాయుడు, సత్యనారాయణ తదితరులు ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా కన్నబాబురాజును, ఎంపీగా ముత్యాల నాయుడును గెలిపించాలని కోరారు.

వైఎస్ జగన్‌తోనే అన్ని వర్గాలకు మేలు

మునగపాక: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావడం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని వైఎస్సార్‌సీపీ నేత కాండ్రేగుల చందు అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, యు.వి. రమణమూర్తిరాజులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మండలంలోని నాగులాపల్లిలో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలన్నారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మళ్ల ఉమామహేశ్వరరావు, వైస్ ఎంపీపీ చిందాడ దేవి, పార్టీ నేతలు బొడ్డేడ బుజ్జి, ముచ్చకర్ల సత్యనారాయణ తదితరులు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.



నాగులాపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత చందు,పార్టీ శ్రేణులు

జోరుగా ఎమ్మెల్యే కన్నబాబు ప్రచారం

అచ్యుతాపురం: యలమంచిలి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కన్నబాబు రాజు జోరుగా ప్రచారం చేస్తున్నారు. స్థానిక సెజ్ కాలనీ(దిబ్బపాలెం)లో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి సీఎం జగన్ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించారని చెప్పారు. వచ్చే నెల 13వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రొంగలి జగన్నాథం, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, కొమ్మెజు ఈశ్వరరావు,వడిశెల శ్రీనివాసరావు, పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు.



దిబ్బపాలెం సెజ్ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు రాజు,పక్కన రొంగలి జగన్నాథం

మత్స్యకార గ్రామాల్లో ప్రచార జోరు

నక్కపల్లి: తీరప్రాంతం వెంబడి ఉన్న మత్స్యకార గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. జోగులుకు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేపట్టారు. శనివారం రాజయ్యపేటలో జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, పార్టీనాయకులు ఎరిపల్లి నాగేశు, మాజీ ఎంపీటీసీ పిక్కి తాతీలు, మైలపల్లి సూరిబాబుల ఆధ్వర్యంలో మహిళలు, పార్టీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్‌గుర్తుకు ఓటేయాలని ఎంపీగా ముత్యాల నాయుడును,ఎమ్మెల్యేగా కంబాల జోగులును గెలిపించాలని కోరారు. తీరం ఒడ్డున వివిధ పనులు చేసుకుంటున్న వారిని కూడా కలిసి వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. జగనన్న సీఎం అయ్యాకే గంగపుత్రుల కోసం పలు పథకాలు అమలు చేశారని చెప్పారు. రాజయ్యపేటలో మత్స్యకారుల ఉపాధి కోసం మినీ జెట్టి, ఫిష్‌ల్యాండింగ్‌సెంటరు మంజూరు చేశారన్నారు. జగనన్న మళ్లీ సీఎం అయితే ఈ పనులన్నీ పూర్తయి ఈ ప్రాంత మత్స్యకారులకు ఉపాధి లభిస్తుందని, వలసలు తగ్గిపోతాయని వివరించారు.ఈ ప్రచారంలో నాయకులు యజ్జల అప్పలరాజు, పిక్కి నూకరాజు, వెంకటేష్, పైడితల్లి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.



రాజయ్యపేటలో ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ కాసులమ్మ తదితరులు

నక్కపల్లి చేరిన ఈవీఎంలు

నక్కపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించే ఈవీఎంలు శనివారం నక్కపల్లికి చేరుకున్నాయి. వీటిని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లో పటిష్టమైన బందోబస్తు మధ్య భద్రపరిచారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలు మాత్రమే వచ్చాయని, అసెంబ్లీ ఎన్నికల్లో ఉపయోగించే ఈవీఎంలు రావాల్సి ఉందని ఆర్వో గీతాంజలి తెలిపారు. ప్రస్తుతానికి 350 బ్యాలెట్ యూనిట్లు, 350 కంట్రోలు యూనిట్లు, 379 వీవీ ప్యాక్‌లు వచ్చినట్లు ఆమె తెలిపారు. అనకాపల్లి నుంచి వ్యాన్‌లో వచ్చిన ఈవీఎంలను వివిధ రాజకీయ పార్టీనాయకుల సమక్షంలో దించి స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద సాయుధ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎలక్షన్ డీటీ చైనులు, ఆర్ఐ కన్నబాబు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



నక్కపల్లికి చేరుకున్న ఈవీఎంలు

భక్తిశ్రద్ధలతో పూజలు

రాంబిల్లి: మండలంలోని దిమిలిలో సీతారాముల కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం సీతారాముల సన్నిధిలో పూజలు నిర్వహించడంతో పాటు భజనలు చేస్తున్నారు. ఈ నెల 17న సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అదే రోజు భారీ అన్న సమారాధన, పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.



సీతారాముల సన్నిధిలో పూజలు చేస్తున్న అర్చకుడు

17న జిల్లా స్థాయి చదరంగం పోటీలు

ఎస్.రాయవరం: జిల్లా స్థాయి చదరంగం పోటీలను ఈ నెల 17న నిర్వహించనున్నట్టు టోర్నమెంట్ ఆర్గనైజర్, అనకాపల్లి జిల్లా చదరంగం సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారి నుంచి ఈ నెల 20న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని చెప్పారు. 17 ఏళ్ల లోపు వయస్సు కలిగిన విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఇరువురు బాలికలు, బాలురను ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. ఆసక్తిగలవారు ఏపీ చెస్ ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో 16 తేదీ లోపు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 96766 36661, 80990 98268 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

స్ట్రాంగ్ రూంకు ఎన్నికల సామగ్రి

యలమంచిలి రూరల్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అవసరమైన స్టేషనరీ, ఇతర ముఖ్యమైన సామగ్రి శనివారం యలమంచిలి చేరుకున్నాయి. ఓ ప్రత్యేక వాహనంలో వచ్చిన మెటీరియల్‌ను యలమంచిలి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.మనోరమ స్వాధీనపర్చుకుని, స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. ఏఆర్వోలు,ఇతర ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.



వాహనం సీల్ పరిశీలిస్తున్న యలమంచిలి ఆర్వో మనోరమ

19న నృసింహుని తిరు కల్యాణం

అనకాపల్లి: స్థానిక గవరపాలెం దిబ్బవీధి కొబ్బరితోటలోని వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో 19న స్వామి వారి తిరుకల్యాణ మహోత్సవం జరిపిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు మళ్ల రామచంద్రరావు శనివారం తెలిపారు.ఆ రోజు రాత్రి 7 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత నృసింహస్వామి పరిణయ వేడుక జరుగుతుందన్నారు. మే 10న చందన మహోత్సవం ఉంటుందని, ఆ రోజు భక్తులకు స్వామివారి నిజరూప దర్శనం కల్పిస్తామని తెలియజేశారు.

నాలుగు కిలోల గంజాయి స్వాధీనం

పాయకరావుపేట: ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరి అరెస్టు చేసినట్టు సీఐ పి.అప్పలరాజు తెలిపారు. తాండవ చెక్ పోస్టు వద్ద శనివారం వాహనాలు తనిఖీ చేసినట్టు ఆయన చెప్పారు. ఆర్టీసీ బస్సులో తుని వెళ్తున్న బోను శ్యామలరావు, ఆత్మకూరి సురేష్ అనే ఇద్దరు వ్యక్తులు పోలీసులను గమనించి పారిపోతుండగా, వెంబడించి పట్టుకున్నట్టు చెప్పారు. విజయవాడ అర్బన్ ఏరియాకు చెందిన వీరి నుంచి గంజాయి స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు పంపినట్టు సీఐ తెలిపారు.

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

యలమంచిలి: అగ్నిమాపక వారోత్సవాలను ఆదివారం నుంచి నిర్వహించనున్నట్టు స్థానిక అగ్నిమాపక అధికారి డి.రాంబాబు తెలిపారు. అగ్నిమాపక అమర వీరులను స్మరించుకుంటూ ఈ నెల 14నుంచి20 వరకు నిర్వహించే వారోత్సవాల్లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు.